అమ్మో.. ఆటోనగర్!



ఆటోనగర్ బి- బ్లాక్‌లో అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసిన లారీలు



రాంనగర్‌లో రోడ్డుపై భారీ వాహనాలు



ఆటోనగర్ డి- బ్లాక్‌లో రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

పార్కింగ్ యార్డు ఉందా...?

ఆటోనగర్ పార్కింగ్ యార్డుకు కాంట్రాక్టర్ వ్యవస్థ ఉండేది. కానీ యార్డులో వాహన కాంట్రాక్టర్ వ్యవస్థ ఉందా! లేదా అనే సందేహం తలెత్తుతోంది. ఇదే విధంగా ఆటోనగర్ బి – బ్లాక్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డు పక్కనే కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆటోనగర్ ఏపీఐఐసీ ఐలా కార్యాలయం **స్థలాలను పూర్తిగా ఆక్రమించుకుని వాహన సర్వీసింగ్ సెంటర్ నిర్వహిస్తున్నా ఐలా అధికారులు చూసీ చూడ**నట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఐలా, ఏపీఐఐసీ అధికారులు పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో రోడ్డుపై ప్రమాదకరంగా పార్కింగ్ చేస్తున్న వాహనాల పట్ల చర్యలు తీసుకోవాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.

- ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- రోజుల తరబడి రోడ్లపైనే ..
- నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు
- భయపడుతున్న ప్రజలు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ అంటే వాహన చోదకులు వణికిపోతున్నారు. వివిధ పరిశ్రమలకు వివిధ రాష్ట్రాల నుంచి ముడిసరకుఎగుమతి, దిగుమతి చేసుకోవడానికి వచ్చే వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. రోజుల తరబడి లారీలు రోడ్లపై ఉండిపోవడంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలు వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

ఇక్కడ నిత్యం నరకం

ముఖ్యంగా ఆటోనగర్ ఎ, బి, డి బ్లాకుల్లో పార్కింగ్ అతిపెద్ద సమస్యగా మారింది. డి – బ్లాక్‌లో పార్కింగ్ యార్డు ఉంది. కానీ లారీ డ్రైవర్లు పార్కింగ్ యార్డులో పెడితే ఫీజు చెల్లించాల్సి వస్తుందనే కారణంతో వారికి లోడింగ్‌కు అవసరమైన పరిశ్రమ ఎదురుగా లారీలను రోజుల తరబడి ఉంచేస్తున్నారు. కాగా పార్కింగ్ యార్డులో లారీ సిబ్బందికి సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతోనే పరిశ్రమల వద్దే తమ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని పలువురు డ్రైవర్లు అంటున్నారు. అయితే రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలపై ఐలా సిబ్బంది చర్యలు తీసుకోక పోవడంతో ఈ పరిస్థితి నెలకుందని పలువురు ఆరోపిస్తున్నారు.



ఆటోనగర్ రాంనగర్ ఏ - బ్లాక్‌లో రోడ్డుపై పార్కింగ్ చేసిన భారీ వాహనాలు

ప్రమాదం నుంచి తప్పించుకున్నా...

చుక్కవానిపాలెం నుంచి ఆటోనగర్ బి – బ్లాక్ గుం**డా గాజువాక వె వెళ్తున్నా**. బి- బ్లాక్‌లో నుంచి **వెళ్తున్న నేను రోడ్డుపై** పార్కింగ్ చేసిన లారీను **తప్పించి వెళ్తున్న క్రమం**లో ఒక్కసారిగా లారీ కదిలింది. ఆ సమయంలో లారీను ఢీ కొట్టేవాడిని. త్రుటిలో ప్రమాదం తప్పింది. రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సోమసుందరం, వాహనచోదకుడు, చుక్కవానిపాలెం

రోడ్లపైనే పార్కింగ్

ఆటోనగర్‌లోని పలు బ్లాకుల్లో రోడ్డుపైనే భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో మా వాహనాలతో బయటకు వెళ్లాలంటే చాలా భయంగా ఉంటుంది. వీటిని తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్లు ఇరుగ్గా మారిపోతున్నాయి. దీంతో పక్కపక్క నుంచి వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారుతోంది. అధికారులు స్పందించాలి.

– ధర్మారావు, గుడివాడఅప్పన్నకాలనీ.

క్లుప్తంగా

నేడు ఉక్కు రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ యధావిధిగా కొనసాగించాలన్న డిమాండ్‌పై గురువారం ధర్నా చేపట్టనున్నారు. స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం (వీఎస్‌పీఆర్‌ఈఏ), ఉక్కు అధికారుల సంఘం, అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ధర్నాలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు మాటూరి శ్రీనివాసరావు కోరారు.

విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని వినతి



యూసీడీ పీడీ సత్యవాణికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: టిడ్కో గృహ సముదాయాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులు విద్యుత్ మీటర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవాణి సూచించారు. సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో టిడ్కో లబ్ధిదారులు బుధవారం ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవాణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ డీఈ, ఏఈలను కలిసి సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అప్పలరాజు, సత్యనారాయణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు

పెదగంట్యాడ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అదానీ గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు అన్నారు. అదానీ ఫౌండేషన్, అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో జాలరిపల్లిపాలెంలో బుధవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగవరం, దిబ్బపాలెం, శ్రీనగర్ వంటి ప్రాంతాల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బాక్సింగ్ రింగ్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల స్వీకరణ



చైతన్యనగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న పేదలందరికీ రెండు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని సీపీఐ నాయకులు అప్పారి విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. జీవీఎంసీ 72వ వార్డులోని చైతన్యనగర్‌లో అర్హులైన పేదల నుంచి ఇళ్ల స్థలాల కోసం సీపీఐ నాయకులు దరఖాస్తులు స్వీకరించారు. ఇంటి స్థలం కోసం పేదల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు నివేదిస్తామని విష్ణుమూర్తి, జి.ఆనంద్ తెలిపారు.

గణపతి ఆరాధనతో సర్వసిద్ధులు

ఎంవీపీకాలనీ: శ్రీ మహాగణపతి వైభవంపై బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు బుధవారం కొనసాగాయి. రుషిపీఠం సత్సంగం శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్క్ వేదికగా ఈ కార్యక్రమం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా షణ్ముఖశర్మ వేద, పురాణ, మంత్ర శాస్త్రాల సహిత శ్రీ మహా గణపతి వైభవాన్ని వివరించారు. గణపతి ఆరాధనతో సర్వసిద్ధులు లభిస్తాయన్నారు. సర్వమంత్రాలకు మూలం ఓంకారమని పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నిర్వాహకులు కె.వి.ఎస్.శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పర్యవేక్షించారు.

దుర్గాలమ్మా.. చల్లగ చూడమ్మా



గ్రామంలో సారె ఊరేగిస్తున్న భక్తులు

దుర్గాలమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ డొంకాడ ప్రజల ఆరాధ్య దైవం దుర్గాలమ్మ ఆలయ 22వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా గ్రామంలోని రామాలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు మహిళలు పెద్ద సంఖ్యలో సారెను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో అగనంపూడి సెక్టార్–1 నిర్వాసితకాలనీలు, బీసీకాలనీ, సాయినగర్ కాలనీల భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, సన్యాసిరావు, బొబ్బరి అప్పారావు, దాసరి నామయుడు, కరణం శ్రీను, అట్టా అప్పారావు, బళ్ల సత్తిబాబు, కరణం పెంటారావు, సీహెచ్.దుర్గారావు, వై.గణేష్, డి.రవి, ఐ.పెంటారావు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు తొలగించిన వ్యక్తిపై కేసు



సర్వే నంబర్ 129లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తొలగించిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించి గాజువాక రెవెన్యూ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గాజువా మండలం వడ్లపూడి గ్రామం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 129లోని వెయ్యి గజాల ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దాన్ని ఎలాంటి అనుమతి లేకుండా తాడి విజయ్‌కుమార్ తొలగించడంతో రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు మంగళవారం గాజువాక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బుధవారం ఆ స్థలంలో గాజువాక రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తాడి విజయకుమార్ స్థలంపై హైకోర్టులో వేసిన పిటిషన్‌పై న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఉల్లంఘించాడని తహసీల్దార్ శ్రీవల్లి తెలిపారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా.. ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించినా లేదా ధ్వంసం చేసినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 33/11 కేవీ షీలానగర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ జగ్గయ్యపాలెం ఫీడర్, 11 కేవీ పోర్టు రోడ్డు ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ 2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం తెలిపారు. విద్యుత్ వైర్లకు అంతరాయంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమంతో పాటు సబ్ స్టేషన్లలో నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హరిజనజగ్గయ్యపాలెం, అయ్యప్ప స్వామి ఆలయం ఏరియా, ఎస్టీబీఎల్, పోర్టు రోడ్డు ఏరియా, టోల్ గేటు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

స్వతంత్రనగర్ ఫీడర్ పరిధిలో..

11 కేవీ స్వతంత్రనగర్ ఫీడర్, 33/11 కేవీ కూర్మన్నపాలెం ఎస్ఎస్, 11 కేవీ ఏబీఆర్ ఫీడర్, 33/11 కేవీ ఆటోనగర్ ఎస్ఎస్ సబ్ స్టేషన్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. సుందరయ్య కాలనీ, అఫీషియల్ కాలనీ రోడ్డు నంబర్ 3, 4, 5, 6, శ్రీనగర్ దిబ్బపాలెం కాలనీ, కృష్ణదేవరాయ నగర్, పాతకర్ణవానిపాలెం, స్వతంత్రనగర్, వై – జంక్షన్ పోర్టు రోడ్డు, సర్దార్ నెస్ట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అగనంపూడి: కేబీఆర్ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా అగనంపూడి ఇండోర్ సబ్ స్టేషన్, అగనంపూడి సెక్షన్ కార్యాలయం పరిధిలోని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. దువ్వాడ సెక్టార్–2, యాతపాలెం, లక్కరాజుపాలెం, శివాజీనగర్, గళ్లవానిపాలెం, అగనంపూడి పాత ఊరు, జాబిలీహిల్స్, శనివాడ పరిసర కాలనీల్లో ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

దువ్వాడ వీఎస్ఈజెడ్ పరిధిలో...

దువ్వాడ వీఎస్ఈజెడ్ సబ్‌స్టేషన్ కేబీఆర్ 33కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. 11కేవీ కూర్మన్నపాలెం, 11కేవీ కేబీఆర్ ఫీడర్ ఆలిండియా రేడియో రిసీవింగ్‌స్టేషన్, కేబీఆర్ పారిశ్రామిక ప్రాంతం, కేబీఆర్ రిజర్వాయర్ ఫీడర్ల పరిధిలోని హెచ్‌టీ వాటర్ వర్క్స్ కారణంగా శాతవాహననగర్ రోడ్డు నంబర్ 1 నుంచి 9 వరకు, యాతపాలెం, ముస్తాఫా కూడలి, భరత్‌నగర్, కూర్మన్నపాలెం, ఐటీఐ రోడ్డు, గౌరీనగర్, అశోక్‌నగర్, శివాజీనగర్, ఆలిండి రేడియో స్టేషన్, శివసాయినగర్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలు అందించాలి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



వైద్య సిబ్బందితో సమీక్షిస్తున్న డాక్టర్ జగదీశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఇమ్యూనైజేషన్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. సిబ్బందికి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి, ఓపీ, ఐపీ సేవలు, ఈహెచ్‌ఆర్, డయాగ్నోస్టిక్ సేవలపై సమీక్షించారు. ముఖ్యంగా ఎన్‌సీడీ 3.0 సర్వే గురించి, ఆర్‌బీఎస్‌కే/ఆర్‌కేఎస్‌కే మొదలైన అంశాలపై చర్చించారు. అభ ఐడీ, మ్యాపింగ్ శతశాతం సాధించాలని వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ బద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉక్కు దీక్షలు



దీక్షలో కూర్చొన్న పలు యూనియన్ల నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కూర్మన్నపాలెంలో కూడలిలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నాటికి 1469వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు కేంద్ర ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు.స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, డి. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



దేవన్‌రెడ్డిని అభినందిస్తున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీని పటిష్టం చేయాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ కూడా కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. దేవన్‌రెడ్డిని బుధవారం 87వ వార్డు నాయకులు కార్యకర్తలు కలిసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చడం ద్వారా పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆయన కోరారు. దేవన్‌రెడ్డిని అభినందించిన వారిలో వార్డు నాయకులు దుగ్గపు దానప్పలు,బొండా గోవిందరాజులు,ముద్దపు మురళీమోహన్, రాఘవ, అప్పడు తదితరులు ఉన్నారు.

భెల్ సావనీర్ గిఫ్ట్‌ల అందజేత



భెల్ ఉద్యోగులకు సావనీర్ అందజేస్తున్న ఏజీఎం లీల

అక్కిరెడ్డిపాలెం: భెల్(హెచ్‌పీవీపీ) ఉద్యోగులకు ఏటా ఇస్తున్న సావనీర్‌ను గిఫ్ట్‌లను ఈ ఏడాది కూడా అందజేశారు.సంస్థ గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఏజీఎం (హెచ్‌ఆర్) ఎస్.లీల చేతుల మీదుగా 5 లీటర్ల కుక్కర్‌ను ఉద్యోగులకు అందజేశారు. వారం రోజుల్లో వాటర్ బాటిళ్ల కూడా అందజేస్తామని గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి సుభాకర్ సాహూ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) జి.చంద్రశేఖర్, యూనియన్ ప్రతినిధులు పి.వి.ఎన్.రాజు, కొల్లి దేముడు, పి.భాస్కరరావు, బి.రవీంద్రబాబు, రాజన్న, కంచిపాటి ప్రకాష్, వీరభద్రారావు, పి.ప్రసాదరావు, ఎస్.బి.ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాభవం...ప్రభవించేనా...?



విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఏర్పడింది విశాఖ స్టీల్ ప్లాంట్. ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. ఇంతలో ప్రైవేటీకరణ అంశం తెరమీదకు వచ్చింది. నాటి నుంచి విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి పోరాటాలు, ఉద్యమాలు జరుగుతున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ అనగానే జాతీయ రహదారిని ఆనుకుని ఉండే భారీ పైలాన్, చుట్టూ ఉన్న అందమైన పార్క్ గుర్తుకు వస్తాయి. అయితే విశాఖ స్టీల్ ప్లాంట్ పరిస్థితికి అద్దం పట్టే విధంగా ప్రస్తుతం పైలాన్ పరిసరాలుఉన్నాయి. గతంలో నాటిన మెక్కలు మోడు వారాయి. పైలాన్ నిర్వహణ చూసే వారు కరువయ్యారు. దీంతో గత ప్రాభవాన్ని కోల్పోయింది. ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాంతాన్ని పరిరక్షిస్తూ, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

-ఫొటో, సాక్షి ఫోటో గ్రాఫర్, విశాఖపట్నం

ఏయూలో ముగిసిన వజ్రోత్సవాలు



వక్తలను సన్మానిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలు బుధవారంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సైంటిస్టులు భూగర్భ జలవనరుల వినియోగం, వాటిని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో పాల్గొన్న వక్తలను సన్మానించారు. జాతీయ సదస్సులో భాగంగా వర్సిటీ జియో ఫిజిక్స్ విభాగం భవనం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వైజ్ఞానిక ప్రదర్శనను సైంటిస్టులు, ఆచార్యులు, విద్యార్థులు తిలకించారు. భూగర్భ గనుల శాఖ, ఇన్ కాయిస్, ఫిషరీస్ విభాగం, నగర పాలక సంస్థ తదితర ప్రభుత్వ శాఖలు ప్రత్యేకంగా ప్రదర్శన ఏర్పాటు చేశాయి. వేడుకలో భాగంగా 2024 సంవత్సరానికి డాక్టర్ హరినారాయన్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణను నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.వి.నాయుడు, ఐజీయూ ప్రతినిధి డాక్టర్ ప్రసాద్, ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పేలవంగా ముగింపు..

ఇదిలా ఉండగా.. జియో ఫిజిక్స్ విభాగం వజ్రోత్సవాలకు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. వర్సిటీ వందేళ్ల ఉత్సవాలకు ముందు నిర్వహించే వేడుక కావడంతో దీనిలో మిగతా విభాగాల వారిని కూడా భాగస్వాములను చేస్తే బాగుండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముగింపు ఉత్సవాలకు ఏయూ వైస్ చాన్సలర్ లేకపోగా.. రిజిస్ట్రార్ సైతం పాల్గొనక పోవడంతో వజ్రోత్సవాలు పేలవంగా ముగిసినట్లయింది.

ఆచార్య ప్రసన్నశ్రీకి సత్కారం

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఎస్టీ ఆచార్యరాలు ప్రసన్నశ్రీని ప్రభుత్వం ఆదికవి నన్నయ వర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమించడంపై అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం హర్షించింది. రాష్ట్రంలో తొలిసారి ఆదివాసీ మహిళను వీసీగా నియమించడంపై సంఘ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ప్రసన్నశ్రీని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కలిసి సత్కరించారు. ఆదివాసీల అభ్యున్నతికి, గిరిజన తెగల ఉన్నత విద్యా భోదనకు ఆచార్య ప్రసన్నశ్రీ చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనేక గిరిజన తెగల మాటలకు అనుగుణంగా భాష, లిపిని రూపొందించడం ఆమె సేవలకు నిదర్శనమన్నారు.

సింహగిరిపై శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచార పూజలు జరిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా చేశారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా



మాట్లాడుతున్న జిల్లాప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: ఏపీఎస్‌ఆర్‌టీసీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తూ ఆర్టీసీ యాజమాన్యం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు పోస్టల్ అధికారులు, పర్సనల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అన్ని డిపో అధికారులతో తన చాంబర్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అద్దె బస్సుల డ్రైవర్లు, పొరుగు సేవల డ్రైవర్లు, బస్సు అటెండర్లు, బస్టాండ్, గ్యారేజ్, ఆర్టీసీ కార్యాలయాల్లో పని చేసే ఔట్‌సోర్సింగ్ స్వీపర్లు, ట్రాఫిక్ గైడ్లు, కౌంటర్లలో టికెట్స్ బుక్ చేసే సిబ్బంది, ఇతర ఉద్యోగులందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. పోస్టల్ శాఖ అంత్యోదయ శ్రామిక్ సురక్ష యోజన కింద ఈ బీమా అమలు చేయనున్నట్టు తెలిపారు.